


న్యూస్ బాక్స్

పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

సుల్తానాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు రైతులకు సూచించారు. మార్కెట్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పత్తి రైతులను ఆదుకోవడానికి పత్తి పంటను సీసీఐ ద్వారా కొనుగోలు చేయిస్తూ క్వింటాలుకు రూ.7521 చెల్లిస్తోందన్నారు. చిన్నకలువలలోని వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ సెంటర్ ఏర్పాటు చేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాపాలన ప్రభుత్వ విజయోత్సవాలలో భాగంగా మహబూబ్‌నగర్‌లో ఈనెల 30న నిర్వహించే రైతు సభకు మండలం నుంచి రైతులు పెద్దసంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే డిసెంబరు 4న పెద్దపల్లిలో యువత సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ కందునూరి పోచాలు, కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

లైబ్రరీకి కొత్త పుస్తకాలు

సుల్తానాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం మండలంలోని గర్రెపల్లి లైబ్రరీకి 72 కొత్త పుస్తకాలను అందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ రెండు రోజుల క్రితం గర్రెపల్లి లైబ్రరీని సందర్శించగా అక్కడ ఉన్న నిరుద్యోగ యువత తమకు పోటీ పరీక్షల కోసం కొత్త పుస్తకాలు అవసరమని కోరగా, 72 పుస్తకాలను కొనుగోలు చేసి గురువారం లైబ్రరీకి పంపించారు.

కౌలు రైతుల్లో ఆనందం



- సన్నాలకు రూ.500 బోనస్‌తో ప్రయోజనం
- జిల్లాలో 82 శాతానికి పైగా సాగు
- రైతుల ఖాతాల్లో రూ.29కోట్లు జమ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో సన్న రకం వరి ధాన్యం పండించిన కౌలు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు సన్నరకం ధాన్యానికి బోనస్ ఇస్తుండడంతో వారికి ప్రయోజనం చేకూరుతోంది. ఈ బోనస్ ప్రతి సీజన్‌లో ఇవ్వాలని కోరుతున్నారు. గడిచిన వానాకాలం సీజన్‌లో సన్నాలు సాగు చేసే రైతులకు క్వింటాలుకు 500 రూపాయల చొప్పున విక్రయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఆ మేరకు జిల్లాలో సన్న రకం వరి పంటను రైతులు ఎక్కువగా వేశారు. 2 లక్షల 9 వేల 562 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, ఇందులో సన్న రకం 1,72,879 ఎకరాల్లో సన్న రకం వరి, 36,683 ఎకరాల్లో దొడ్డు రకం వరి పంటను రైతులు సాగు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్న రకం ధాన్యానికి పౌరసరఫరాల శాఖాధికారులు వారి ఖాతాల్లో బోనస్ సొమ్మును జమ చేస్తున్నారు. గ్రామాల్లో సొంత భూములతో పాటు కొన్ని భూములను కౌలుకు తీసు కుని వరి, పత్తి, తదితర పంటలను పండిస్తున్నారు. మొత్తానికే వ్యవసాయ భూములు లేని వ్యవసాయ కూలీలు భూములను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో పట్టా కలిగిన ప్రతి ఒక్కరికి ఎకరానికి 5 వేల రూపాయల చొప్పున రెండు సీజన్లలో డబ్బులను జమచేసింది. దీంతో భూములు ఉన్న వారికే ప్రయో జనం దక్కింది. కౌలు రైతులకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించలేదు. రైతుబంధు లేదు, రైతు బీమా వర్తించలేదు.

ఏడాది క్రితం హామీ..

ఏడాది క్రితం తాము అధికారంలోకి వస్తే రైతుభరోసా కింద ఎకరానికి 7,500 రూపాయల చొప్పున అందజేస్తామని, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు సైతం రైతుభరోసా కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ మేరకు ప్రభుత్వం రైతుభరోసా ఇచ్చేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని వేసింది. పంటలు సాగయ్యే భూములు గల వారికే రైతుభరోసా ఇవ్వాలని భావిస్తున్నది. వానాకాలం సీజన్‌కు రైతు భరోసా ఇవ్వకపోగా, సన్నాలు సాగు చేసే వారిని ప్రోత్స హించేందుకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. బోనస్ ఇవ్వడం కౌలు రైతులకు లాభం చేకూరుస్తున్నది.

రైతు భరోసా వేయకపోయినా భూములను కౌలుకు తీసుకుని సన్నాలను సాగు చేసిన రైతులకు బోనస్ ఇస్తుండడంతో సంబరపడుతున్నారు. ఒక్కో సీజన్‌కు వరి పండించే కౌలు రైతులు ఎకరానికి 10 వేల నుంచి 15వేల రూపాయలు కౌలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం పంట దిగుబడులు ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్లు వస్తుండడంతో రైతులకు 10 వేలకు పైగా బోనస్ వస్తున్నది. జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 324.70 కోట్ల రూపాయల విలువైన 1,42,924 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇందులో సన్న రకం ధాన్యం 97,083 టన్నులు, దొడ్డు రకం ధాన్యం 44,423 టన్నులు కొనుగోలు చేశారు. 282.41 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించారు.

అలాగే 8140 మంది రైతులు విక్రయించిన 591282.40 క్వింటాళ్ల సన్న రకం ధాన్యానికి 29 కోట్ల 56 లక్షల 41 వేల 200 రూపాయల బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లాలో చాలా మంది కౌలు రైతులు బోనస్ వల్ల ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. రైతు భరోసా ఇవ్వకుండా రైతులు పండించే పంటలపై బోనస్ చెల్లిస్తే

మిగతా 8వ పేజీలో



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

శ్రావ్య మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

- గోదావరిఖనిలో ఐలు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

8



మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల నెరవేర్చండి

- సింగరేణి ప్రాతినిధ్య సంఘం నాయకులు

8

మధ్యాహ్న భోజనం నాణ్యతపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితులలో చిన్న సంఘటన కూడా జరగకుండా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యత అంశంపై కలెక్టర్ కోయ శ్రీహర్ష హెడ్‌మాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మధ్యాహ్న భోజన విషయంలో రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న సంఘటనలపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించిందని, పిల్లలకు అందించే ఆహారం నాణ్యత అంశంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ ఉండదని స్పష్టం చేసిందన్నారు. జిల్లాలో పిల్లలకు అందించే ఆహారం విషయంలో చిన్న తప్పు కూడా జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఒక చిన్న సంఘటన జరిగినా విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేసే పరిస్థితి ఉందని, ఇది అందరూ దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పాఠశాలలో పిల్లలకు ఆహారం అందించే ముందు రైస్, పప్పు, కూరగాయల నాణ్యతను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలన్నారు. పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం వండే దగ్గర పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో ఉన్న రైస్ నాణ్యతను ఒకసారి పరిశీలించాలని, బియ్యంలో ఎక్కడైనా పురుగులు పట్టినట్లు ఉంటే వెంటనే స్టాక్ మార్చివేయాలని ఆదేశించారు. పాఠశాలలో పిల్లలతోపాటు హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు భోజనం చేసేలా చూడాలన్నారు. పాఠశాలల్లో తాగునీటి సరఫరా నాణ్యతను సైతం పరీక్షించాలని తెలిపారు. నల్గొండలో నీటి ట్యాంకులో మరణించిన కోతి పడిందని అటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేస్తూ మధ్యాహ్న భోజన నాణ్యత పెంచాలని తెలిపారు. పిల్లలు భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని అభినందించిన కలెక్టర్



ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన ఉపాధ్యాయుడు దూసి కౌండిన్యను కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. రామగిరి మండలం వాణి ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు దూసి కౌండిన్య కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖతో పాటు అనుబంధ మంత్రిత్వ శాఖలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్(ఐఐఎస్ఎఫ్)కు ఉపన్యాసకుడిగా ఎంపికయ్యారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయుడిని అభినందించారు. ఐఐటీ గౌహతిలో ఈనెల30 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగే ఈ ఫెస్టివల్‌లో సైన్స్ ఎరౌండ్ అజ్ అనే అంశంపై కౌండిన్య ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఉపన్యాసకుల్లో దక్షిణ భారత దేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపాధ్యాయుడు జిల్లాకు చెందిన వ్యక్తి కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం : డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పరిధి జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 28 స్కానింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, జిల్లాలో జరిగే ప్రతి స్కానింగ్‌కు సంబంధించి ఫారం రూపొందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. లింగ నిర్ధారణ అరికట్టడానికి ప్రతినెల స్కానింగ్ సెంటర్లను తనిఖీ నిర్వస్తున్నామన్నారు. అధికంగా అబార్షన్ జరిగే ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

కోల్‌సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో శుక్ర, శని వారాలు రెండు రోజుల పాటు 11డివిజన్లలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్ప డుతుందని కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా వేసిన అంతర్గత వాటర్ పైప్‌లైన్లకు కనెక్షన్లు ఇవ్వాల్సిన దృష్ట్యా అశోక్‌నగర్ వాటర్ ట్యాంకు పరిధిలో ఉన్న 10, 11, 26, 27, 28, 30, 31, 40, 41, 49, 50 డివిజన్లలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో టీపీసీసీ ఇన్‌చార్జి దీపక్ మున్షి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీ గెలిపించుకోవాలని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని శాసన మండలికి పంపించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన సీపీ



విద్యార్థులను అభినందిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గురువారం రామగుండం సీపీ శ్రీనివాస్ రామగుండం అభినందించారు. కజామ్ స్పోర్ట్స్ కరాటే-కుంగ్ ఫూ మార్షల్ ఆధ్వర్యంలో ఇటీవల హన్మకొండ కాజీపేటలో 9వ జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. గోదావరిఖనికి చెందిన హరాయాన్-చుంగ్-కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ ఎం రాజేశం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కె నిహారిక, ఎండి గౌస్, అయాన్, సైతేజశ్రీ, ఎస్ కె రయాన్, జి.లక్ష్మి, రామ్, ఎం.శ్యామ్, అక్షర, సంజీవ్, ఎస్.కె ఆర్యన్‌లను సీపీ అభినందించి మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కె.రాములు, విద్యార్థులు, పాల్గొన్నారు.

అన్నార్థులకు సహాయసహకారాలు అందించాలి

- మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని అన్నార్థులకు తమ వంతుగా సహాయసహకారాలు అందించాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. దివంగత కోరుకంటి విజయ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక పోచమ్మ దేవాలయం ఆవరణలో శ్రీధర్మశాస్త్ర అన్నదాన వేదిక ద్వారా చందర్ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను, ఆకలితో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ బాదె అంజలి, కవిత, సరోజిని, నాయకులు అచ్చె వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, కౌటంబాబు, నారాయణదాసు మారుతి, మేడి సదానందం, సట్టు శ్రీనివాస్, నీరటి శ్రీనివాస్, తిమోతి తదితరుల పాల్గొన్నారు.

సింగరేణి గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ సమావేశం

- 13 డిమాండ్లపై యాజమాన్యం సానుకూలత - అన్నింటిని పరిష్కరిస్తామని హామీ



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు, ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలపై కార్పొరేట్ స్థాయిలో యాజమాన్యంతో సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చర్చించే స్ట్రక్చర్ సమావేశం గురువారం కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో జరిగింది. ఆరు నెలలకు ఒకసారి జరగాల్సిన ఈ సమావేశం ఐదేళ్ళ తర్వాత గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో సింగరేణి ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. ఈసందర్భంగా 13 అంశాలతో ఏఐటీయూసీ చేసిన ప్రతిపాదనలను యాజమాన్యం సానుకూలన వ్యక్తంచేసింది. అన్నింటికి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చింది. సింగరేణి ఉన్నతాధికారులతో జరిగిన ఈ సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్‌కుమార్‌తో పాటు స్ట్రక్చర్ కమిటీ సభ్యులు మిర్యాల రంగయ్య, సారయ్య, వీరభద్రం, వైవీ రావు, సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, వెంకట్, రాం గోపాల్, అక్బర్ అలీ పాల్గొన్నారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలనే ప్రతిపాదనకు సింగరేణి అధికారులు అంగీకారం తెలిపారు. సూపర్‌వైజర్లకు సూటబుల్ జాబ్ ఇవ్వడానికి అంగీకరించిన అధికారులు ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్ల విషయంలో సీఎండీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిస్మిస్ అయిన ఏఎంఈటీలను తిరిగి అదే హోదాలో విధుల్లోకి తీసుకుంటామని, మిగతా డిస్మిస్ అయిన వారి విషయంలో కమిటీ వేసి పరిష్కరిస్తామని అధికారులు గుర్తింపు సంఘం నాయకులకు తెలిపారు. క్యాంటీన్లను సంస్థ నిర్వహించాలనే డిమాండ్‌తో పాటు ఆహార పదార్థాల నాణ్యత పెంచడం, కాంట్రాక్టు కార్మికులకు క్యాంటీన్ వసతి కల్పించడంపై యాజమాన్యం అంగీకారం తెలిపింది. ఈపీ ఆపరేటర్లు డీ నుంచి సీ, సీ నుండి బీ ఖాళీలతో నిమిత్తం లేకుండా నిర్దీత సమయానికి ప్రమోషన్లు ఇచ్చేందుకు యాజమాన్యం సానుకూలత వ్యక్తంచేసింది. శ్రీరాంపూర్ ఓసీపీ, సీహెచ్‌పీల కార్మికులకు వేర్వేరుగా ఇన్‌సెంటివ్ ఇవ్వడం, మారు పేర్లు విజిలెన్స్ కేసులు, పెండింగ్ కేసుల విషయంలో డిసెంబర్‌లో సీఎండీతో జరగనున్న సమావేశంలో చర్చించి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. వేజ్‌బోర్డులో 11 రకాల అలవెన్స్‌లను పెంచడం, 2000 ర్యాంక్‌వరకు ఇస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్‌లను ఎనిమిది వేల ర్యాంక్ వరకు ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. కొత్త ఇన్ సెంటివ్ కమిటీ వేసి పరిష్కరించడానికి అంగీకారం కుదిరింది. ఎన్-1 తీసివేయడానికి ఆడిట్ బోర్డులో ఆమోదం తీసుకుని అమలు చేసేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు.

మూడు నెలల్లో క్యాడర్ స్కీం సమస్య పరిష్కరిస్తామని, డిసెం బర్ నుండి మార్చి వరకు ప్రొడక్షన్ ప్రోత్సాహ క బహుమతులు ఇవ్వాలనే ప్రతిపాదనలకు యాజమాన్యం అంగీకారం తెలిపింది. డైరెక్టర్ (పా) వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ బలరాం ఏఐటీయూసీ నాయకులతో మాట్లాడారు. డైరెక్టర్లు, అన్ని విభాగాల కార్పొరేట్ జీఎంలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ధాన్యం కొనుగోళ్ల వివరాలు వెంటనే నమోదు చేయాలి - కలెక్టర్ కోయ శ్రీహర్ష



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మంథని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంగా విద్యార్థులకు నాణ్యతతో అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మండలంలోని కన్నాల, గుంజపడుగు, చిల్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించడంతోపాటు గుంజపడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన కార్యక్రమాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్నం భోజనం తయారీ ఉపయోగించే సరుకులు నాణ్యంగా ఉండాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం పట్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల సమాచారాన్ని వెంటనే వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు ఉండదని, మిల్లర్లు ఎలాంటి కోతలు విధించవద్దన్నారు. ఆయన వెంట ఏడీఏ అంజని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో గురువారం గౌతమినగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమారపు లావణ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మగువ అధ్యక్షురాలు సునీత, చిందం స్వరూప, తిరుమల, సద్గుణ, బీన, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఆభరణాలు అప్పగింత



ఆభరణాల బ్యాగ్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ ఒక మహిళ తన హాండ్‌బ్యాగ్ పోగొట్టుకోగా అందులో 10 తులా బంగారు ఆభరణాలున్నాయని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ బ్యాగ్‌ను వెదికిపట్టుకుని బంగారు ఆభరణాలతో సహా బాధితురాలికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన హీనా పర్వీన్ అనే మహిళ బుధవారం తన తల్లితో కలిసి కరీంనగర్ నుంచి ఆటోలో గ్రామానికి వెళ్లింది. ఈ సమయంలో తన హాండ్ బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. కొద్దిసేపటి తరువాత తన హ్యాండ్ బ్యాగ్ కనిపించకపోవటంతో గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు ప్రారంభించి, సైబర్ క్రైం పోలీసులు, సిబ్బందితో గంటల సమయంలోనే ఆటోను గుర్తించి హాండ్‌బ్యాగ్‌ను వెదికిపట్టుకున్నారు. 10 తులాల బంగారు ఆభరణాలు, మొబైల్‌ఫోన్‌లతో కూడిన హ్యాండ్ బ్యాగ్‌ను భద్రతంగా బాధితురాలికి అప్పగించారు. సత్వరమే స్పందించి, బంగారు ఆభరణాల బ్యాగ్‌ను భద్రంగా వెదికిపట్టుకోవటంలో కృషి చేసిన ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ మాణిక్యరెడ్డి, ప్రదీప్‌లను కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ కేంద్రంలో సీపీ అభిషేక్ మొహంతి అభినందించారు. వారికి రివార్డులతోపాటు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

మృతదేహం లభ్యం

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో గురువారం మృతదేహం లభించినట్లు ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. స్థానికుల సమాచారంతో అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం కుళ్లిపోయి ఉందని, బయటకు తీసి జేబులు తనిఖీ చేయగా ఆధార్‌కార్డు ఉందని తెలిపారు. ఆధార్‌కార్డులో ఉన్న చిరునామా బీహార్ రాష్ట్రంలోని నస్గండ్ రోతాస్‌కు చెందిన నందకిషోర్‌రాంగా గుర్తించారు. మృతుడు కాకీ కలర్ స్వెటర్, బ్లూజీన్స్ వేసుకొని ఉన్నాడు. మృతదేహన్ని పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం..

కోల్‌సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లోని డ్రైన్‌లో గుర్తు తెలియని మృతదేహన్ని గురువారం గుర్తించారు. పెట్రోల్ బంక్, మున్సిపల్ కార్యాలయం మధ్యలో ఉన్న డ్రైన్‌లో మృతదేహం ఉంది. 35సంవత్సరాల వయసు గల వ్యక్తిదిగా భావిస్తున్నారు. మృతదేహన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం

గొల్లపెల్లి, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) గొల్లపల్లి మండలం చిల్వాకోడూరు గ్రామానికి చెందిన వ్యవసాయ భూమిలో గురువారం గుర్తుతెలియని మృత దేహన్ని స్థానికులు గుర్తించారు. మృదతదేహం పూర్తిగా కుళ్లిన పోయి గుర్తు పట్టడానికి కూడా వీలు లేకుండా ఉన్నది. మృతుడి కుడి చేయి పై సౌజన్య అని పచ్చ బొట్టు ఉన్నది. మరో చేయిపై దిక్కులను సూచిస్తున్న పచ్చ బొట్టు ఉన్నది. కేసు నమోదు చేసుకొని సంఘటనా స్థలంలోనే పోస్ట్ మార్టం నిర్వహించినట్టు గొల్లపెల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

యువకుడి మృతిపై విచారణ చేపట్టాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

వీర్నపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన ఈశంపల్లి అశీష్ (19) అక్టోబరు 1న తన స్నేహితులతో కలిసి వీర్నపల్లి వైపు వెళుతుండగా అడవి పదిర గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పిగాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాగా తమ కుమారుడిని స్నేహితులే గాయపర్చినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ బాధితులపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి కనకయ్య ఎస్పీ అఖిల్‌మహజన్‌కు దరఖాస్తు ఇచ్చాడు. మృతదేహన్ని హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో స్వగ్రామానికి గురువారం తీసుకరాగా సుమారు 300 మంది ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్థులు అంబేద్కర్ విగ్రహం వద్ద అందోళన చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్‌కుమార్, ఈశంపల్లి కొమురయ్య డిమాండ్ చేశారు. మృతదేహంతో కొద్దిసేపు నినాదాలు చేస్తూ అందోళన నిర్వహించారు. అక్కడే ఉన్న స్థానిక ఎస్‌ఐ ఎల్లాగౌడ్ యువకుడి కుటుంబసభ్యులు, గ్రామస్థులతో మాట్లాడి పోస్టుమార్టం నివేదిక అధారంగా బాధితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అందోళన విరమించారు. అనంతరం మృతదేహన్ని ఇంటికి తరలించి పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

నలుగురు శిశువుల దత్తత

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని కరీంనగర్ శిశుగృహంలో పెరుగుతున్న నలుగురు శిశువులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిల్లలు లేని దంపతులకు దత్తత ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇద్దరికి మగ, ఇద్దరికి ఆడ శిశువులను దత్తతగా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. ఇందుకోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, భగత్‌నగర్, కరీంనగర్‌లో సంప్రదించాలని సూచించారు. రక్త సంబంధీకుల నుంచి చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలనుకునే వారు కూడా ఈ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డిసిపివో ఫర్వీన్, పివో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వీ, ఔట్ రీచ్ వర్కర్ రమేశ్, సోషల్ వర్కర్ రాజేశ్ పాల్గొన్నారు.

● బాల్య వివాహ్ ముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ :


బాల్య వివాహ్ ముక్త్ భారత్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 10 వరకు జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన ప్రచారకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని బాల్య వివాహాల నిర్మూలన అధికారులుగా ఉన్న ఆర్డీవో, తహసీల్దార్లు, సీడీపీవోలను ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి క్రీడల ఏర్పాట్లను పరిశీలించిన డీఈవో

హుజూరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి (ఎస్‌జీఎఫ్) అండర్-14 బాలుర, బాలికల హాకీ క్రీడలు జరిగే ఏర్పాట్లను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పీఈటీలు వేణుగోపాల్, సారయ్య, రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక, శేఖర్ పాల్గొన్నారు.

ఆటల్లో ఆణిముత్యాలు

● వాలీబాల్ క్రీడల్లో జూలపల్లి విద్యార్థుల సత్తా.. ● రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు..



జూలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ క్రీడలో సత్తా చాటుతున్నారు. మండల కేంద్రానికి చెందిన శ్రునిక్ అనే విద్యార్థి 2021లో పాఠశాలలో చదువుతున్న సమయంలో వాలీబాల్ సబ్‌జూనియర్ విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. అలాగే గత ఏడాది మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన చక్రినాథ్‌గౌడ్ అనే విద్యార్థి అండర్ 17, శివక్రిష్ణ అనే విద్యార్థి అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. మండలానికి చెందిన మరికొంత మంది యువకులు వాలీబాల్ క్రీడలో రాణిస్తుండడంతో వారి తల్లిదండ్రులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరికొందరు విద్యార్థులు మరిన్ని విజయాలు సాధిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతా..

టి. సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి మండ లానికి పేరు మంచి గుర్తిం పు తెస్తుండడం వారి తల్లిదండ్రులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులుగా మాకు సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో మరికొందరు విద్యార్థుల ను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను.



సబ్‌జూనియర్ విభాగంలో జాతీయస్థాయిలో రాణించిన శ్రునిక్, రాష్ట్ర స్థాయిలో రాణించిన శివక్రిష్ణ, చక్రినాథ్‌గౌడ్



క్రికెట్‌లో రాణిస్తున్న రామగుండం విద్యార్థి

అంతర్గాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ఏరియాకు చెందిన మహమ్మద్ తౌఫిక్ క్రికెట్‌లో రాణిస్తున్నాడు. గోదావరి ఖనిలోని మైనారిటీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో తౌఫిక్ నిజామాబాద్, వరం గల్‌లో జరిగిన పోటీల్లో అండర్-14 విభా గంలో ప్రతి భ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. అనంతరం హర్యానా, గోవా రాష్ట్రాలలో జరిగిన పోటీల్లోనూ రాణించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 2022 నేపాల్‌లోని పొఖ్రా స్టేడియంలో ఆడి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం తౌఫిక్ ఐటీఐ చదువుతున్నాడు.





నేపాల్‌లో తౌఫిక్ అందుకున్న ప్రశంసా పత్రం

వేధింపులకు పాల్పడ్డ ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ఓ మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలిపై వేధింపులకు పాల్పడిన వ్యవహారంలో అదే పాఠశాలకు చెందిన బాధ్యుడైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న తనపై అదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు వేధింపులకు పాల్పడుతున్నాడని మూడు రోజుల క్రితం బాధితురాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. సంఘటనపై విచారణ జరపాలంటూ ఉన్నతాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు డీఈవో సైతం విచారణ చేసి వివరాలను సేకరించారు. ఉపాధ్యాయురాలిని వేధింపులకు పాల్పడ్డట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సదరు ప్రభుత్వ పాఠశాల సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బదిలీ

భగత్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత హైదరాబాద్ రీజినల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. రంగారెడ్డి రీజియన్‌లో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బిరాజు పదోన్నతిపై కరీంనగర్ రీజినల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ జోన్ ఈడీగా పనిచేస్తున్న మునిశేఖర్ హైదరాబాద్ బస్‌భవన్‌కు బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఖుస్రోషాఖాన్ కరీంనగర్ ఈడీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ధర్నా



ధర్నా చేసున్న విద్యార్థులు

తంగళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ప్రధాన ద్వారం ఎదుట విద్యార్థులు ధర్నాకు దిగారు. అధిక సంఖ్యలో వసతి గృహంలో విద్యార్థులను చేర్చుకోవడాన్ని నిరసిస్తూ గురువారం విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్‌లో లెక్కకు మించి విద్యార్థులను చేర్చుకోవడంతో తాము హాస్టల్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి హాస్టల్ కష్టాలను తీర్చాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై కళాశాల అసోసియేట్ డీన్ శ్రీదేవిని వివరణ కోరగా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కళాశాలలో చదువుకుం టున్న విద్యార్థినులను చేర్చుకున్నట్లు తెలిపారు. విద్యార్థినుల రక్షణ కోసం తాత్కాలికంగా వసతి గదులు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థినుల భద్రతా చర్యల్లో భాగంగా తప్పనిసరిగా హాస్టల్లో చేర్చుకోవాల్సి వచ్చిందన్నారు. త్వరలోనే విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థి



షేక్ ఆఫాన్‌ను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి అండర్-19 కేజీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ ఆఫాన్ ఎంపికయ్యాడు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-19 జూనియర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభచాటి బంగారు పతకం సాధించిన షేక్ ఆఫాన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ట్రినిటీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అతనికి పుష్పగుచ్ఛాన్ని, ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. ట్రినిటీ సంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయాలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పి శ్రీచరణ్ పటేల్, టి రణవీర్ రాజ్, పి సహన్, పి శ్రీహర్ష, వి యుక్తలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముఫ్జాజిల్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు..

భీమారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో అథ్లెటిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని గోవిం దారం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఆకునూరి అశ్విత, భూపతి అవంతిక, తుమ్మ హర్షవర్ధన్‌లు జిల్లా స్థాయి జావెలన్ త్రో, 600 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అష్పాఖ్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు రిశ్వంత్, హర్షిత్, తేజేశ్వర్ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో ప్రతిభ చాటి డిసెంబరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ శ్రీకాళహస్తి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రమోద్ రాజు తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, పాషిగామ గ్రామాల మధ్యన వరంగల్- రాయపట్నం రాష్ట్ర రహదారిపై గురువారం ఆరు ఆటో ఢీ కొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం స్తంభంపల్లి, పాషిగామ గ్రామాల మధ్య ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో ఆటో నుజ్జు నుజ్జు అయింది. ఆటోలో ప్రయాణిస్తున్న మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన ఇందారపు కిరణ్, మేడి శ్రీధర్, మేడి సతీష్, గోపతి కిషోర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. హుటా హుటిన క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాటన్ పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కాటన్ పరిశ్రమపై దృష్టి పెట్టి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర అధ్యక్షుడు మోడం మల్లేశం అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్ ఆదర్శ పద్మశాలి సంఘం భవనంలో సిరిసిల్ల సైజింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐఎఫ్‌టీయూ) జిల్లా సర్వసభ్య సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షుడు వల్లాల కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో అనుబంధ పరిశ్రమ సైజింగ్ కార్మికులు ఉపాధిలేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం బతుకమ్మ చీరలపైనే శ్రద్ధ చూపడంతో కాటన్, పాలిస్టర్, సైజింగ్, డైయింగ్ పరిశ్రమలు కుదేలై ఉపాధి లేక కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాటన్ పరిశ్రమపై దృష్టి సారించి ఆర్డర్లు ఇచ్చి పరిశ్రమతో పాటు కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బి రవీందర్, సైజింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిగేటి రాము, సహాయ కార్యదర్శి కూరపాటి సతీష్, నాయకులు కొమరయ్య, యూసుఫ్, మల్లేశం, చంద్రయ్య పాల్గొన్నారు.



ధర్మపురిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



వేములవాడలో రాజన్నకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆలయాల్లో భక్తుల రద్దీ

- ధర్మపురిలో 27వ రోజు గోదావరి హారతి
- వేములవాడలో దీపాలు వెలిగించిన మహిళలు

ధర్మపురి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి, వేములవాడ ఆగయాల్లో కార్తీకమాసం సందర్భంగా గురువారం సందడి నెలకొంది. ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తుల సంఖ్య పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు చేసిన భక్తులు, గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజించి దొప్పలో కార్తీక దీపాలు ఉంచి, గోదావరి నదిలో వదిలారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ నిత్య పూజలు, అభి షేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 27 వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించి నదీ మాతకు హారతి ఇచ్చారు.

రాజన్న ఆలయంలో ..

వేములవాడ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి ఆయా క్యూలైన్ ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని తరించారు. ఆలయ ఆవరణలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

● వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. గురువారం రాత్రి ఆలయ కళావేదికలో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఆలయ సూపరింటెండెంట్ వరి నర్సయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులతో పాటుగా పట్టణవాసులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు ఓం, స్వస్తిక్, లింగాకృతిలో పూలతో అందంగా అలంకరించి దీపాలను వెలిగించారు. కాగా కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



రాజన్న ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

రాంగ్ పార్కింగ్‌పై పోలీసుల కొరడా



లాక్‌చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సిరిసిల్ల క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో వాహనాల రాంగ్ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ రమేశ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా, గాంధీచౌక్, నేతన్నచౌక్ తదితర ప్రాంతాల్లో రహదారులపై పార్క్‌చేసిన వాహనాలకు లాకింగ్ చేశారు. ప్రతీ వాహనానికి జరిమానా విధించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో దివ్యాంగుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న క్రీడాకారులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వికలాంగుల క్రీడల పోటీల్లో జగిత్యాల జిల్లాకు చెందిన వికలాంగ క్రీడాకారులు సత్తాచాటారని జిల్లా సంక్షేమ అధికారి భోనగిరి నరేష్ తెలిపారు. కోరుట్లకు చెందిన రజినీ అనే దివ్యాంగురాలు క్యారం పోటీల్లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకోగా, వెల్లటూర్‌కు చెందిన పవన్‌కళ్యాణ్ రన్నింగ్, షాట్‌పుట్‌లో ద్వితీయ బహుమతి పొందినట్లు పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ చేతుల మీదుగా బహుమతులు పొందారని తెలిపారు. క్రీడాకారులను కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు.

బోనాల ఉత్సవాల్లో గుండెపోటుతో వ్యక్తి మృతి



గంగాధర్(ఫైల్)

రాయికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో బోనాల ఉత్సవాల్లో విషాదం నెలకొంది. గురువారం గ్రామంలో పోచమ్మ బోనాలు నిర్వహిస్తుండగా పోతురోజు నృత్యం చేస్తున్న బోదనపు గంగాధర్ (58) అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.



హత్య జరిగింది.. నిందితులు పారిపోయారు. క్లూస్ టీం వచ్చింది.. ఎటువంటి ఆధారాలు లభించలేదు.. ఈ సమయంలో వస్తుంది.. డాగ్‌స్క్వాడ్.. సంఘటన స్థలాన్ని పరిశీలించి వాసన పసిగట్టి నేరస్థులు ఏ మార్గంలో వెళ్లారు.. ఎక్కడెక్కడ తిరిగారు.. లాంటి ఆధారాలను విచారణ అధికారులకు అందజేస్తుంది. ఇలా కీలక కేసులలో పోలీసులకు సహాయం చేస్తున్న పోలీస్ డాగ్స్‌పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..





పవర్ ఫుల్ పోలీస్ డాగ్స్

● ఎనిమిది నెలల కఠోర శిక్షణ ● శాంతి భద్రతల రక్షణలో తమదైన పాత్ర

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ డాగ్ స్క్వాడ్.. అంటే ప్రతి ఒక్కరికీ ఆసక్తి ఉంటుంది. పోలీసులకు నేరాల ఛేదనలో సహాయకారిగా ఉండే జాగిలాలకు ఎనిమిది నెలల కఠిన శిక్షణ ఇస్తారు. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో పోలీస్ డాగ్స్‌కు శిక్షణ ఇస్తున్నారు. తమకు అవసరమైన జాగిలాల గురించి ఆయా యూనిట్ల అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తారు. ఇంటలిజెన్స్, సెక్యూరిటీ వింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఆయా యూనిట్లకు కావాల్సిన కుక్కలను (స్నిఫర్ లేదా ట్రాకర్) తీర్చిదిద్దేందుకు మూడు నెలల వయస్సు కలిగిన కుక్క పిల్లలను అందుబాటులోని కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. వాటిని హ్యాండ్లింగ్ చేసేందుకు ఏఆర్ కానిస్టేబుల్స్‌ను ప్రదిపాదిత అధికారులు హైదరాబాద్‌కు పంపిస్తారు. ఒక్కో హ్యాండ్లర్‌కు ఒక్కో జాగిలం బాధ్యతను అప్పచెబుతారు.

మొదటి నెలలో గ్రూమింగ్, వేళకు ఆహారం ఇవ్వడం ద్వారా హ్యాండ్లర్ పై కుక్కకు ప్రేమ, ఆకర్షణ కలిగేలా చేస్తారు. ఈ సమయంలో కుక్క తన యజమానిని గుర్తించే స్థాయికి చేరుతుంది. నాలుగో నెల నుంచి ఐదో నెల వరకూ విధేయత, కూర్చోవడం, నిలబడడం, పడుకోవడం, సెల్యూట్ చేయడం వంటివి నేర్పిస్తారు. ఆ తర్వాత వాటికి ఉన్నతాధికారుల సమక్షంలో పరీక్ష నిర్వహిస్తారు. వీటిలో ఉత్తీర్ణత పొందిన వాటికి ఐదు నెలల పాటు బాంబులను కనిపెట్టడం, లేదా నిందితుల ఆచూకీని కనిపెట్టడం, ఇతర అంశాల్లో పూర్తి స్థాయి శిక్షణనిస్తారు.

జాగిలాలను హ్యాండ్లర్లు కంటికిరెప్పలా చూసుకుంటారు. పొరపాటున ఒక కుక్క ఏదైనా కారణంతో మృతి చెందినట్లయితే హ్యాండ్లర్‌దే పూర్తి బాధ్యత ఉంటుంది. సంబంధిత హ్యాండ్లర్‌పై ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకుంటారు. ఒక్కోసారి ఉద్యోగం నుంచి ఉద్వాసన పలకడంతోపాటు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ప్రత్యేక సౌకర్యాలు

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు డాగ్స్‌కు ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో రక్షణ కోసం కూలర్లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి రోజు వేడి నీళ్లతో స్నానం చేయిస్తారు. ఒక్క పూటకు 250 గ్రాములు వంతున రెండు పూటలు రాయల్‌కెనాన్ ప్రత్యేక ఫీడ్‌ను ఆహారంగా అందిస్తారు. ఇందులో చికెన్, మటన్ మిశ్రమం ఉంటుంది.

మావోయిస్టు ప్రభావం ఉన్నప్పుడు..

జిల్లాలో గతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న సమయంలో పోలీసు సిబ్బంది ప్రాణాలు కాపాడుకోవటానికి పోలీస్ డాగ్స్ కీలకంగా పనిచేశాయి. అటవీ ప్రాంతాల్లో నక్సల్స్ ఎక్కడ మందుపాతరలు పెట్టారో... ఎక్కడ జిలెటిన్‌స్టిక్స్‌ను భద్రపరిచారో కనుక్కోవడంలో డాగ్స్ కీలక పాత్రను పోషించాయి. అనంతరం పలు కేసు ఛేదనలో తమ వంతు ప్రాతను పోషిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం టైగర్, డాని, రాంబో, మిక్కీ, లియోలు, టైసన్ అనే 6 జాగిలాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో మూడు ట్రాకర్స్ రెండు ఎక్స్‌ప్లోజివ్ స్నిఫర్ డాగ్స్, ఒకటి నార్కోటిక్ స్నిఫర్ డాగ్ వీటికి ఆరుగురు శిక్షణ పొందిన ఏఆర్ కానిస్టేబుల్స్ హ్యాండ్లర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.



కేసుల ఛేదనలో మేటి

ఉమ్మడి జిల్లాలోని మారు మూల అటవీ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేతకు కూంబింగ్‌కు వెళ్లిన అప్పటి పోలీసులకు ఒక అనుమానిత ప్రాంతంలో పేలుడు పదార్థాలను పోలీసుడాగ్ పసిగట్టడంతో పెను ప్రమాదం తప్పింది. - జిల్లాలో ఓ మహిళను గుర్తుతెలియని గొంతు నులిమి హత్య చేసి ఒంటిపైన ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకు పోయారు. వెంటనే రంగంలోకి దిగిన డాగ్‌స్క్వాడ్ సంఘటనా స్థలంలో వాసన పసిగట్టిన డాగ్ (విక్కీ) కొంత దూరంలో ఉన్న నిందితుడి ఇంటికి వెళ్లి బంగారు ఆభరణాలు దాచిపెట్టిన చోటును చూపించింది. దీంతో పోలీసులు ఇంటి యజమానిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఇలా జిల్లాలో ఎన్నో కేసులను డాగ్ స్క్వాడ్ సహాయంతో పోలీసులు ఛేదించారు.

ఎనిమిదేళ్లపాటు మాతోనే ఉంటాయి..

ఎలుక శంకర్, లియోడాగ్ హ్యాండ్లర్



నాలుగు నెలల వయస్సు నుంచి ఎనిమిదేళ్ల వరకు మాతోటే జాగిలం చనువుగా ఉంటుంది కాబట్టి మా కుటుంబలో ఒక సభ్యుడిగానే భావిస్తాం. నాలుగు నెలల నుంచి హ్యాండ్లర్‌తో ఎనిమిది నెలలపాటు కఠోర శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం ఏడాది వయస్సు న్న జాగిలాన్ని హ్యాండ్లర్‌తోపాటు జిల్లాకు కేటాయి స్తారు. హ్యాండ్లర్ బదిలీ అయితే జాగిలం కూడా బది లీ అవుతుంది. ఒక్కసారి జాగిలానికి హ్యాండ్లర్‌తో హాండ్లర్‌తో శిక్షణ ఇస్తే దాని ప్రాణం ఉన్నంతవరకు అతడితోనే ఉంటుంది. వేరొకరి మాట వినదు. మత్తు పదార్థాలు, ఎక్స్‌ప్లోజివ్స్, వ్యక్తుల చెమట వాసనను చూపిస్తూ జాగిలాలకు నెలకు ఒకసారి ట్రైనింగ్‌లో పరీక్షలు నిర్వహిస్తుంటాం.

ఉద్యోగ విరమణ

సాధారణంగా శునకాల జీవిత కాలం 12 నుంచి 14 సంవత్సరాలు. పోలీస్ జాగిలాలకు ఎనిమిదేళ్లు నిండగానే ఉద్యోగ విరమణ చేయిస్తారు. ఎందుకంటే ఈ వయసుకు వచ్చే సరికి జాగిలాలలో వాసన పసిగట్టే శక్తి తగ్గిపోతుంది. పేలుడు పదార్థాలను గుర్తించే జాగిలాలు సాధారణం కంటే 40 రెట్లు ఎక్కువగా వాసన పీల్చుతాయి. పదవీ విరమణ చేసిన పోలీస్ జాగిలాలను వాటి హ్యాండ్లర్స్‌కు అప్ప గించేవారు. ఒక వేళ వీటిని పెంచుకునేందుకు వారు సమ్మతించకపోతే జంతు ప్రేమికులు ముందుకు వస్తే పోలీసు ఉన్నతాధి కారులు అన్ని విధాల పరిశీలించాక వారికి అప్పగించే వారు. జంతు ప్రేమికులకు అప్పగించిన రెండు నెలల వరకు వాటి బాగోగులను, యజమానితో జాగిలాలు వ్యవహరిస్తున్న తీరును వాటి హ్యాండ్లర్లు తప్పని సరిగా పరిశీలించేవారు.

ప్రస్తుతం పోలీసుశాఖనే జాగిలాల సంరక్షణ బాధ్యతను తీసుకుని మరణించేవరకు పోషిస్తోంది. శోధనకు వెళ్లిన సమయంలో పాలు, కొబ్బరినీరు అందిస్తారు. ప్రతి రోజు 45 నిమిషాల వాకింగ్, 30 నిమిషాల ఎక్సైర్‌సైజ్ తప్పనిసరిగా నిర్వహిస్తారు.

హెల్మెట్ ధరించి.. అవగాహన కల్పించి..

- రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థుల ప్రదర్శన



హెల్మెట్లు ధరించి అవగాహన ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. గ్రామ శివారులోని పాఠశాల నుంచి కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి గుండా తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, కొత్త, పాత బస్టాండుల మీదుగా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. తమ ఆటాపాటల ద్వారా చైతన్యం నింపారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు అహల్యబాయి కృషి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అప్పాల ప్రసాద్, నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అహల్యబాయి హోల్కర్ 18వ శతాబ్దం లో మహిళా సాధికారత కోసం ఎనలేని కృషి చేశారని అఖిల భారత సమరసతా కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. అహల్యబాయి హోల్కర్ జయం తి వేడుకలను పురస్కరించుకొని సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ముద్రించిన ఆమె జీవిత చరిత్ర పుస్తకాన్ని అప్పాల ప్రసాద్, నాయకులు గురువారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యుడు సురేంద్రబాబు, సమరసతా వేదిక సభ్యులు భాస్కర్, రవి, రమేష్‌చారి, సంతోష్, పవన్, కరుణాకర్ పాల్గొన్నారు

ప్రమాదకరంగా మూలమలుపులు

- రాకపోకలకు వాహనదాల ఇబ్బందులు

మల్లాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని ఆయా గ్రామాల శివారులో పలుమూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. రహదారికి ఇరువైపులా ములుపులు అందులోనూ రహదారికి ఇరువైపులా మొక్కలు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చేంతే వరకు తెలియక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరి కొందరు మూల మలుపులపై అవగాహన లేక ప్రమాద బారినపడి ఆసు పత్రుల పాలవుతున్నారు. ముత్యంపేట, కు స్థాపూర్, రాఘవపేట, గుండంపల్లి, రేగుంట, ధాం రాజుపల్లి, వివిరావుపేట, తదితర గ్రామాల శివారులో ఉన్న మూల మలుపులపై అధికారులు చర్యలు తీసుకో వాలని వాహనచోదకులు కోరుతున్నారు.



ప్రమాదకర మూలమలుపు



కుస్థాపూర్ శివారులో ప్రమాదకర మూలమలుపులు

గ్రామాల్లో కోతుల స్వైర విహారం

- మనుషులపై దాడి - ఇళ్లపై గూనపెంకులు ధ్వంసం - భయబ్రాంతులకు గురువుతున్న ప్రజలు



సైదాపూర్‌లో వీధుల్లో తిరుగుతున్న వానరాలు

సైదాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. మనుమలపై దాడి చేస్తుండడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతు న్నారు. వానరాలు గుంపులు గుంపులుగా గ్రామాల్లో చేరి ఇళ్లపై గూన పెంకులు ఊడబెరుకుతున్నాయి. నీళ్ల పైపులను విరగ్గొడుతున్నాయి. తలుపు తీసి ఉంటే చాలు.. ఇళ్లలోకి చేరి వంట సామగ్రిని చిందవందర చేస్తున్నాయి. పత్తి, మొక్క జొన్న పంటలను నాశనం చేస్తున్నాయి. పత్తి కాయలు తెంపి పడవేస్తూ, మొక్కజొన్న కంకులు విరుస్తూ నష్టం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లపై ఉంటూ అకస్మాత్తుగా దాడి చేస్తున్నాయని, చిన్న పిల్లలను నమ్మి బయట వదిలే పరిస్థితి లేదని మహిళలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోతుల బాధ నుంచి రక్షించాలని కోరుతున్నారు.

● అధికారులు చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రంతో పాటు చాలా గ్రామాల్లో కోతుల బెడద ఉంది. అవి చిన్నపిల్లలు, పెద్దవారు అని చూడకుండా దాడి చేస్తున్నాయి. కట్టె చేతులో లేకుండా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. వానరాలు గుంపులు గుంపులుగా వచ్చి ఇళ్లలో చేరి భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని కోతుల బెడద నుంచి రక్షించాలి.

- గాదపాక కుమార్‌రాజా, సైదాపూర్

● గుట్టల ధ్వంసంతో జనాల్లోకి కోతులు

ఒకప్పుడు గుట్టలు చెట్లతో, పండ్లు ఫలాలతో పచ్చ గా ఉండేవి. కోతులతో పాటు అడవి జంతువులు ఆ గుట్టలను నివాసంగా చేసుకుని జీవించేవి. క్వారీలు ఏర్పరడడంతో చెట్లే కాదు.. గుట్టలూ కనుమరుగవుతున్నాయి. దీంతో అక్కడ నివసించే జీవులు చెల్లాచెదరైపోయాయి. కోతులు గ్రామాల్లోకి చేరి హంగామా చేస్తున్నాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జీవన్‌రెడ్డి

- అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన టీపీసీసీ



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి పేరునే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) మళ్లీ ప్రతిపాదించింది. గురువారం గాంధీభవన్‌లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ నాలుగు జిల్లాల పరిధి కలిగిన ఎమ్మెల్సీ స్థానానికి మార్చిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అభ్యర్థిగా ఎవరి పేరును ప్రతిపాదించాలనే దానిపై చర్చ జరిగింది. పలువురు నేతలు కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నా సిట్టింగ్ ఎమ్మెల్సీ సీనియర్ నేత టి జీవన్‌రెడ్డినే తిరిగి ఆ స్థానంలో పోటీకి నిలపాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. హై కమాండ్‌దే తుది నిర్ణయం అని చెబుతూనే జీవన్‌రెడ్డి పేరును ప్రతిపాదిస్తూ ఈ సమావేశంలో తీర్మానం చేశారు.

● అధిష్ఠానానికి వెళ్లిన ఒకే ఒక్క పేరు

కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని విద్యావేత్త, అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ ఎమ్మెల్సీలు ఆర్ సత్యనారాయణ, నర్సారెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు తదితరులు ఆశించారు. కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందం ఈ అభ్యర్థులపై నియోజకవర్గ పరిధిలోని 42 అసెంబ్లీ సెగ్మెంట్లలో సర్వే నిర్వహించి అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ పేర్లను సిఫారసు చేసిందని ప్రచారం జరిగింది. ప్రస్తుతం టీపీసీసీ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల సమావేశం మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరును మాత్రమే మళ్లీ సిఫారసు చేసింది. పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలి

- పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్



మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వి ధించిన ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని పెన్షనర్ల రాష్ట్ర కా ర్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో పెన్షనర్ల సంఘ సర్వసభ సమావేశంలో పాల్గొన్ని మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నా రు. కేంద్రంలో పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని పార్లమెంట్ శీతాకాల సమావేశంలో గౌరవ భృతిగా ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌పై ఆదాయపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసేందుకు తీర్మానం చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో గాజుల నర్సయ్య, పబ్బా శివానందం, గంటేడి రాజ్ మోహన్, నల్ల లక్ష్మీనారాయణ, ఎండి సైపోద్దిన్, హన్మంత రెడ్డి, వేల్పుల ప్రకాశ్ రా వు, చిటుక గంగారాం, సబిత రాజయ్య, మల్కయ్య, లక్ష్మికాంతం, శ్రీరాములులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రహదారి విస్తరణ కొలతలు



వేములవాడలో ఓ దుకాణంలో కొలతలు వేస్తున్న అధికారులు

వేములవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ కోసం కొలతల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. రెవెన్యూ, ఇంజనీరింగ్, మున్సిపల్, సర్వే విభాగాలకు చెందిన 16 మందితో కూడిన నాలుగు బృందాలు రెండురోజులుగా ప్రధాన రహదారిలోని నివాసాలు, దుకాణాల కొలతలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో వేసిన కొలతలు అంచనాలతో సరి చూసుకుంటూ సర్వే నిర్వహిస్తున్నారు. వారం రోజుల్లో కొలతల సేకరణ మొత్తం ప్రక్రియ పూర్తి చేసి రెవెన్యూ అధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు నవీన్‌కుమార్, మధు, సర్వేయర్లు మధుసూదన్, చామంతి, ఏఈలు గోవింద్, నర్మద, మయూరి తదితరులు ఉన్నారు.

గోదావరికి మహా హారతి



గోదావరినదికి హారతి ఇస్తున్న ఉత్సవ సమితి

కళ్యాణ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పుష్కరఘాట్ నుంచి గోదావరినదమ్మ తల్లికి బుధవారం రాత్రి నక్షత్ర హారతి ఇచ్చి సారె సమర్పించారు. ఈ కార్యక్రమం హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కోకన్వీనర్ క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్యాస జయశ్రీ, ఒజ్జల వెంకటేశ్వర్లు, వైద్యులు లక్ష్మీవాణి, రమ్య, విశ్వహిందు పరిషత్ నాయకులు ఇస్సంపల్లి వెంకన్న, కృష్ణమూర్తి, గుండా మంజుల, భాగ్యలక్ష్మి, రజిత, కృష్ణప్రియ, పద్మ, వీరేశం, అశోక్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 11 మందికి జరిమానా, జైలుశిక్ష

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యో తి): డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 11 మందిని గురువారం పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి మంజుల విచారించి రూ.11వేల 400 జరిమానా విధించారు. సు ల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెంది నీరెల్లి సతీష్‌కు మూడు రోజులు, మంచి ర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన మొగుళ్ల సంతోష్‌కు రెండు రోజులు, పెద్దపల్లి పట్టణం ఉదయ్‌నగర్‌కు చెందిన ఎలుకపల్లి సతీష్‌కు రెండు రోజులు జైలుశిక్ష విధించారు.

న్యూస్ బాక్స్

బసంత్‌నగర్‌లోనే విమానాశ్రయం నిర్మించాలి

పాలకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంత్‌నగర్‌లోనే విమానాశ్రయం నిర్మించాలని కోరుతూ ఈసాలతక్కళ్లపల్లి యువకులు గురువారం తహసీల్దార్ ఎం జ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాన్ని విస్తరించాలని గతంలోనే ఇక్కడ అధికారులు భూసేకరణ చేసి నివేదికలు పంపించారన్నారు. విద్యుత్ హై టెన్షన్ తీగలు అడ్డుగా ఉన్నాయన్న సాకుతో విమానాశ్రయాన్ని అంతర్గాం మండలానికి తరలించడం సరికాదని తెలిపారు. బసంత్‌నగర్‌లోనే విమానాశ్రయం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసాని మల్లేశం, కడారి నర్సయ్య, నలిగంటి శ్యామ్, ముంజాల శ్రీనివాస్ తదితరలున్నారు.

ఆహార పదార్థాలు వృథా చేయకండి

సుల్తానాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వివాహాది శుభకార్యాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను పారవేయకుండా తమకు సమాచారం అందించాలని సుల్తానాబాద్‌కు చెందిన యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తుమ్మ రాజ్‌కుమార్ కోరారు. తాము వాటిని పట్టణంలోని సమీప గ్రామాలలోని అనాథలు, యాచకులకు పంపిణీ చేస్తామని చెప్పారు. తమకు సమాచారం అందిస్తే తామే వచ్చి వాటిని తీసుకవెళ్లి పంపిణీ చేస్తామన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన లంబాడితండా(బి)కు చెందిన భూక్య రాజేశం కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట భూక్య రాజునాయక్, అజ్మీర తిరుపతి నాయక్, అజ్మీర మల్లేశ నాయక్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాలకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరేడ్ మైదానంలో డిసెంబరు 1న జరిగే మాలల సింహగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మండలంలోని కన్నాలలో గురువారం ఆవిష్కరించారు. కన్నాల మాల సంఘం అధ్యక్షుడు బుట్టి శ్రీధర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దేవి లక్ష్మీనర్సయ్య, కాంగ్రెస్ నాయకుడు తొగరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ల అడ్డగింత

పెద్దపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ నుంచి డిసెంబర్ 4న నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి సభకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని గురువారం గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇతరులు మట్టిని తరలిస్తే అధికారులు కేసులు నమోదు చేయడంతో పాటు, వాహనాలు సీజ్ చేస్తారని, అదే ప్రభుత్వ కార్యక్రమాలకు ఇష్టానుసారంగా తరలించడం సమంజసం కాదన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

జ్యోతినగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విశ్వభారతి పాఠశాలలో గురువారం గీతాప్రచార సమితి ఆధ్వర్యంలో మండలస్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 50మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేపూరి రాములుగౌడ్, సత్యనారాయణ, లక్ష్మణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన


మంథని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం సీఐ రాజు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సెల్ ఫోన్, గంజాయి, గుట్కాలు, మద్యం సేవించడం లాంటి వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువు

- తాగునీరు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు



జూలపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్



బస్టాండ్ ఆవరణలో ముళ్లపొదలతో నిండిన మరుగుదొడ్డి

జూలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్‌కు బస్సులు రాక వెలవెలబోయింది. ఏడాది నుంచి ఆర్టీసీ అధికారులు బస్టాండు వరకు బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రయాణికులు కూడా బస్టాండ్‌కు వస్తున్నారు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు ముళ్లపొదలతో నిండి ఉండడంతో ప్రయాణికులు వినియోగించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా బస్టాండ్‌కు వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాలను కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మహాత్మ జ్యోతిబా ఫూలేకు ఘన నివాళి

కళ్యాణ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా ఫూలే వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురు వారం గోదావరిఖని రాజేష్ థియేటర్ వద్ద ఉన్న ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. డిప్యూటీ మేయర్ అభిషే క్‌రావు, కార్పొరేటర్ బాదె అంజలి, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫూలే విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, దీటి బాలరాజు, బొమ్మక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న కోరుకంటి చందర్

● మంథని (ఆంధ్రజ్యోతి): స్థానిక హనుమాన్‌నగర్‌లోని జ్యోతిబాఫూలే విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నేతలు, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఫూలే చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాగంటి కొండయ్య ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా ఫూలే వర్ధంతి నిర్వహించారు. ఉపాధ్యక్షుడు కొమ్మ స్వామి తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో మహాత్మా జ్యోతిభాఫూలే వర్ధంతి సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేషి రవీందర్, పట్టణశాఖ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం మహాత్మా జ్యోతిబా ఫూలే వర్ధంతి నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, సామ రాజేశ్వర్‌రెడ్డి, బైరెడ్డి రాంరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా ఫూలే వర్ధంతి జరిగింది. జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, పొన్నం నవీన్‌కుమార్, అంబటి కనకయ్య, దాసరి రామస్వామి, జంగంపల్లి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, గంట శ్రీనివాస్, కుక్క రవీందర్, పులిపాక దేవేందర్, గట్టు సతీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

మంథని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వసతిగృహంలో ఓ విద్యార్థిపై దారుణానికి ఒడిగటిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గ కేంద్రంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం విచారకరమన్నారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ పనుల్లో నాణ్యత లేకుండా, ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్లు పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాల్లో పరిశీలన

కోల్‌సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని పట్టణంలోని రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు(బ్లాక్ స్పాట్‌లు)లను గురువారం గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్ పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రాజీవ్ రహదారి నిర్వహణ సంస్థ హెచ్‌కేఆర్ ఇన్‌చార్జి రామకృష్ణతో కలిసి పరిశీలించి చర్చించారు.

రాక్ క్లైంబింగ్‌లో ప్రతిభ

కోల్‌సిటీటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిన రాక్ క్లైంబింగ్ అడ్వెంచర్ ట్రైనింగ్‌లో గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న తెలంగాణ 9వ బెటాలియన్ నుంచి పాల్గొని ప్రతిభకనపర్చారు. రాక్ క్లైంబింగ్ అడ్వెంచర్‌లో చూపిన ప్రతిభకు గ్వాలియర్ క్యాంప్ కమాండెంట్ కల్నల్ సుఖ్‌బిందర్‌సింగ్ చేతుల మీదుగా జ్యోత్స్న మెమొంటో అందుకున్నారు. కాగా పాఠశాలకు చెందిన ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న ప్రతిభ కనపర్చి సత్కారం అందుకున్నందుకు 9వ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ డానియల్‌లాడ్యమ్, ప్రిన్సిపాల్ ఆరోగ్యమేరి, కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

జేఎన్టీయూ విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

రామగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం హైదరాబాద్‌కు చెందిన సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి అనుమతి మేరకు విద్యార్థులకు దంత, రక్తహీనత వైద్య పరీక్షల క్యాంప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. దంత వైద్య పరీక్షల కోసం ప్రతి విద్యార్థులకు రెండు రోజుల్లో కిట్స్ అందించనున్నట్లు రోహిణి ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పింగిళి కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ సదానందం, చినాల, సుమాన్, డిస్పెన్సరీ ఇన్‌చార్జి డాక్టర్ రమేశ్, వైద్యులు అలేఖ్య, వంశీకృష్ణ, సంగీత, ప్రీతి, సౌశిల్య, చందన, నిధిన్, దీపిక, అమృత తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

కౌలు రైతుల్లో ఆనందం

(5వ పేజీ తరువాయి)

పంట పండించే ప్రతి రైతుకు, ప్రతి కౌలు రైతుకు లాభం చేకూరనున్నది. ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పంటలు పండించే రైతులకు మద్దతు ధర దక్కడంతో పాటు బోనస్ కూడా దక్కనున్నది.

రూ. లక్షా 26 వేల బోనస్ వచ్చింది..

శ్రీనివాస్ రెడ్డి, గుండ్లపల్లి, ఓదెల మండలం



నేను నా సొంతంగా ఐదు ఎకరాల్లో, ఇంకొక నాలుగు ఎకరాలు కౌలు తీసుకొని సన్న రకాలు సాగు చేశాను. నాకు 253 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దానికి మద్దతు ధరతో పాటు బోనస్ లక్షా 26 వేలు వచ్చింది. నాకు రైతు భరోసా కేవలం 5 ఎకరాలకు సహాయం అందేది. ఇప్పుడు నేను కౌలు చేసిన నాలుగు ఎకరాలకు కూడా బోనస్ అందుకోవడం సంతోషంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

బోనస్ కొనసాగించాలి..

హనుమండ్ల శ్రీలత, రాముని పల్లి, సుల్తానాబాద్ మండలం



నేను రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని బీపీటీ 5204 సన్న రకం సాగు చేశాను. సన్నరకం సాగు చేసేటప్పుడు దిగుబడి తక్కువ వస్తుందని బాధపడ్డాం. కానీ నాకు వ్యవసాయ అధికారులు ఇచ్చిన సూచనలతో సాగు చేయడం వల్ల 52 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ పంటకు మద్దతు ధరతో పాటు 26 వేల బోనస్ వచ్చింది. నాకు చాలా సంతోషంగా ఉంది. బోనస్ ఇలాగే కొనసాగించాలి.

బోనస్ ఇవ్వడం వల్ల మేలు జరుగుతుంది.

దొండేటి రమాకాంత్ రెడ్డి, గుంటూరుపల్లి, పాలకుర్తి మండలం



నాకున్న భూమితో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని ఏడు ఎకరాల్లో ఎంటీయూ-1224 సన్న రకం వరి సాగు చేశాను. 170 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం 85 వేల రూపాయల బోనస్ నా ఖాతాల్లో జమ చేసింది. ఇది నిజంగా సంతోషించదగ్గ విషయం. బోనస్ ఇవ్వడం వల్ల కౌలు రైతులతో పాటు అందరు రైతులకు మేలు జరుగుతుంది. దీనిని ఇలాగే కొనసాగించాలి.

శ్రావ్య మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

కోల్‌సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అంబేద్కర్ లా కాలేజీలో మూడవ సంవత్సరం న్యాయవిద్య చదువుతున్న ఇస్లావత్ శ్రావ్య మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా లాయర్ యూనియన్(ఐలూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చందాల శైలజ డిమాండ్ చేశారు. శ్రావ్య ఆత్మకు శాంతి చేకూరాలంటూ గురువారం రాత్రి ఐలూ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆసంపల్లి రవి, రాంటెంకి శ్రీనివాస్, ప్రదీప్ కుమార్, నాగలక్ష్మి, రజిత, సుజాత, సంతోష, దాదా సలాం, ధరణి, మురళి, ప్రకాష్, లింగస్వామి పాల్గొన్నారు.

పాడి పరిశ్రమలతో రైతులకు ఆర్థిక అభివృద్ధి

ఓదెల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పాడి పరిశ్రమలతో రైతులు ఆర్థిక అభివృద్ధి చెందుతారని కరీంనగర్ పాల డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని మడకలో గురువారం పాల ఉత్పత్తిదారుల సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమ రైతులు ఆర్థిక నష్టాలకు గురైన సమయంలో నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ మడక పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గుడిపాటి కేశవరెడ్డి పాల్గొన్నారు.

రామగుండంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలి

పెద్దపల్లి, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. గురువారం ఆయన ఢిల్లీలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. రామగుండం ప్రాంతంలో ఎయిర్ పోర్టు ఏర్పాటు ద్వారా ఈ పారిశ్రామిక ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. రామగుండం ఏరియాలో కొత్తగా ఇండస్ట్రీస్ రావడానికి అవకాశం ఉందని, తద్వారా ఈ ప్రాంత యువతకు ఉద్యోగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే రామగుండంలో ఎన్టీపీసీ, బసంత్‌నగర్, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ, ఆర్ఎఫ్‌సీఎల్, గోదావరిఖనిలో సింగరేణి కోల్ మైన్స్‌తో పాటు అనేక సహజ, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ

ముత్తారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్యాపూర్ గ్రామంలోగల మోడల్ స్కూల్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ గురువారం తనిఖీ చేశారు. మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలు, విద్యా బోధన తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని కిచెన్ ఏరియా, సరుకులు, వాటి నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యమైన పదార్థాలు మాత్రమే వినియోగించి పిల్లలకు భోజనం తయారుచేయాలన్నారు. వేడివేడి భోజనం అందించాలని, నిల్వచేసిన ఆహారం పిల్లలకు ఇవ్వవద్దని అధికారులకు ఆయన సూచించారు. పాఠశాలలో భోజనం రుచికరంగా ఉంటోందా, మెనూలో వాటిని పాలో అవుతున్నారా అంటూ పలు అంశాలపై విద్యార్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఆర్డీవో రవీందర్

రైతులందరికీ రుణమాఫీ

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రైతులందరికి రుణమాఫీ చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీదని ధర్మారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ అన్నారు. గురువారం ప్రజా పాలన- ప్రజావిజయోత్సవాల్లో భాగంగా సన్న వడ్లకు 500 బోనస్ రైతుల ఖాతాలో జమైన సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీ చిత్రపటాలకు రైతులతో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. రూప్లా నాయక్ మాట్లాడుతూ విడతల వారీగా రైతులందరికి రుణమాఫీ జరుగుతుందన్నారు. వైస్‌చైర్మన్ అరిగె లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, కడారి హన్మయ్య, దేవి జనార్దన్, కొత్త నర్సింహులు, కాంపెల్లి రాజేశం, ఒడ్నాల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంచీల వితరణ

పెద్దపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుగొండ ప్రభుత్వ పాఠశాలకు పెద్దపల్లి లయన్స్‌క్లబ్ ఎంజేఎఫ్ ఆధ్వర్యంలో బెంచీలు గురువారం అందించారు. జోనల్ చైర్మన్ లయన్ రేకులపల్లి శశాంక ఆర్థిక సహకారంతో రూ.45వేల విలువ గల 25డెస్క్ బెంచీలను పాఠశాలకు అందించారు. విద్యార్థుల సౌకర్యార్థం డెస్క్ బెంచీలు అందించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు గ్రామస్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్క జానకి, జోన్ చైర్మన్ రేకులపల్లి సుష్మ, క్లబ్ ప్రెసిడెంట్ వేల్పుల రమేష్, కార్యదర్శి బోడకుంట రాంకిషన్, ట్రెజరర్ మీసాల సత్యనారాయణ, సాదుల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ జైపాల్‌రెడ్డి, నిట్టూరి శ్రీనాథ్, కుమార్, తిరుపతి, మట్ట రాంరెడ్డి, పాంపాటి శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలకు బెంచీలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



విధుల్లో మద్యం సేవిస్తున్న ఉద్యోగులు

గోదావరిఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అత్యవసర విభాగమైన సివిల్ డిపార్ట్‌మెంట్ వాటర్ వర్క్స్‌లో డ్యూటీల్లో మద్యం సేవించడం నిత్యకృత్యమైంది. స్థానిక గోదావరితీరంలోని సింగరేణి హెడ్ వర్క్స్ నుంచి గనులు, ఆర్జీ-1, 2, 3 గనులు, యైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని, సెంటినరీ కాలనీ వరకు కాలనీలకు మంచినీటి సరఫరా చేస్తారు. అక్కడ పనిచేసే సిబ్బంది నిత్యం అప్రమత్తతో వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు విందులకు అడ్డాగా మారింది. డ్యూటీలో మస్టర్ వేసుకుని సైట్ ఆఫీస్‌లోనే దర్జాగా మద్యం సేవిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ముగ్గురు ఉద్యోగులు డ్యూటీలోనే మద్యం సేవించిన ఘటన వెలుగుచూసింది. తోటి సిబ్బంది, ఉద్యోగులు ఉన్నా కూడా డ్యూటీలో మద్యం సేవించడం చర్చనీయాంశం అయ్యింది.



మద్యం సేవిస్తున్న ఉద్యోగులు

ఓసీపీ-2లో మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్

రామగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2 మహిళా ఉద్యోగులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్ఫేస్‌లో పని చేసేందుకు వీలుగా 16రకాల పోస్టులు ఉన్నాయని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సెలింగ్‌లో అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారి సీహెచ్ వెంకటరమణ, ఐఈ చంద్రశేఖర్, పర్సనల్ అధికారి సుదర్శనం, డాక్టర్ కృపానందం, భాస్కర్, మురళి తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

హక్కుల సాధనకు రాజీలేని పోరాటం

- ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కోట రవీందర్‌రెడ్డి

రామగిరి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల పరిష్కారంలో ఐఎన్‌టీయూసీ నాయకత్వం రాజీపడబోదని ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు, వేజ్‌బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్‌ల నేతృత్వంలో పనిచేస్తూ యూనియన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. యూనియన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కార్మికుల డిపెండెంట్‌ల వయస్సును 35నుంచి 40 వరకు పెంచామని పేర్కొన్నారు. కార్మికుల కోసం గోదావరిఖనిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో ఉందని తెలిపారు. అదే విధంగా కోల్‌కారిడార్ ప్రమాదంగా మారిందని మంత్రికి విజ్ఞప్తి మేరకు 4లైన్స్ వేసేందుకు అంగీకారం తెలిపారన్నారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన ఐఎన్‌టీయూసీ ముందు వరుసలో ఉంటుందన్నారు. కాలనీలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన తాగునీటి సమస్య పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పోతనకాలనీ నుంచి సెంటినరీకాలనీకి అడిషనల్‌గా రూ.9కొట్లతో పైప్ లైన్ వేయడం జరుగుతుందన్నారు. ఏఎల్‌పీలో పనిచేసే 150మంది జనరల్ మజ్దూర్లను ఆర్జీ-3 ఏరియాకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్మికుడికి పదోన్నతులను కల్పిస్తున్నట్లు, ఏరియాలో రోడ్లు, మౌళిక వసతుల కల్పనకు సింగరేణి యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. మెడగాని వెంకటేష్, జుబేర్, నరేందర్, ప్రేమ్, రాజు, అంజి, ఇంద్రాసేనారెడ్డి, సంపత్, శంకర్, దయాల్‌శర్మ, కృష్ణ, స్వామి ఉన్నారు.

మితిమీరిన రాజకీయ జోక్యంతో సంస్థ మనుగడకే ప్రమాదం..

- టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ

గోదావరిఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యంతో సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లకాలంలో సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని పెంపొందించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా అదే కొనసాగుతుందన్నారు. రాబోయే పది సంవత్సరాల్లో సంస్థ భారీ నష్టాల్లో బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబు, వైఎస్ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డిలు సింగరేణిలో జోక్యం చేసుకోలేదని, ఎమ్మెల్యేలు జీఎంను కలవాలంటే ఎదురుచూసేవారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, జీఎంలే క్యాంపు కార్యాలయాలకు వచ్చి వేచిచూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరిగి పదోన్నతులు, బదిలీలు చేసుకుంటున్నారన్నారు. సింగరేణి కార్మికులు కష్టించి బొగ్గు ఉత్పత్తిని తీసి లాభాల బాటలోకి తీసుకువస్తే ప్రజాప్రతినిధులు సింగరేణి నిధులను కాజేస్తూ సంస్థను నష్టాల పాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ విలేకరుల సమావేశంలో కోటగిరి పాపయ్య, నగునూరి రాజయ్య, రాజు, సంగెపు రాజు, గుండబోయిన ఓదెలు, కుమార్, మల్లయ్య, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల నెరవేర్చండి

గోదావరిఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సొంత ఇంటి కలనెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సింగరేణి ప్రాతినిధ్య సంఘం నాయకుల బృందం రాష్ట్ర మంత్రులను కోరింది. గురవారం ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నేతృత్వంలో నాయకులు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కార్మికులకు ఇచ్చిన హామీలు, పెండింగ్ సమస్యలను ప్రస్తావించారు. పెర్క్స్‌పై ఐటీని రీయంబర్స్ చేయడం, మెడికల్ బోర్డుకు రెండేళ్ల సర్వీస్ నిబంధన ఎత్తివేయాలని, సొంత ఇంటి పథకం అమలు చేయాలని కోరారు. నైనీలో 800 మెగావాట్ల మూడు సూపర్ పవర్ సోనిక్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో మెడికల్ అన్‌ఫిట్ల పేరిట టీబీజీకేఎస్ నాయకుల కార్మికుల రక్తాన్ని తాగారని, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకునే గడువుపై సింగరేణి యాజమాన్యంతో చర్చించాలని కోరారు. మంత్రులను కలిసిన బృందంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు ధర్మపురి, నర్సింహారెడ్డిలు ఉన్నారు.

ఆర్జీ-2లో స్ట్రక్చర్ సమావేశం



ఏఐటీయూసీ నాయకులతో చర్చిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో గురువారం ఆర్జీ-2 యాజమాన్యం స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించింది. జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం టి వెంకటయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈసమావేశంలో ఏరియా పరిధిలో అపరిష్కృత సమస్యలను ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. సెక్టార్-3 డిస్పెన్సరీలో 24 గంటలు డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలని, వారంలో రోజువారిగా ఒక్కో స్పెషలిస్ట్ వైద్యుడు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. ఏరియాస్థాయిలో జరిగే పనులను పరిష్కరిస్తామని, కార్పొరేట్ స్థాయి వాటికి ప్రతిపాదనలు పంపనున్నట్లు జీఎం నాయకులకు సూచించారు. ఈ స్ట్రక్చర్ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ జీ రవీందర్,పీవో మధుసూదన్, వీకేపీ పీవో నెహ్రూ, ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు సంతోష్‌కుమార్, ధనుంజయ, ఎర్రన్న, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, బుక్య దేశాయి,రామచంద్ర, మహిపాల్, స్ట్రక్చర్ కమిటీ సభ్యులు అన్నారావు, రాజా రత్నం, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, సీగర్, మహేందర్ పాల్గొన్నారు.